క్లుప్తంగా

యోగాసనాలపై తర్ఫీదు



13వ వార్డులో పిల్లలతో కలిసి యోగాసనాలు వేస్తున్న నాయకులు

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం కోసం పిల్లలు, పెద్దలు యోగాసనాల్లో తర్ఫీదు పొందుతున్నారు. యోగాంధ్రాలో పాల్గొనే ముందే ఆసనాల గురించి వీరు తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపంలోని ఖాళీ స్థలంలో పిల్లలతో కలిసి కార్పొరేటర్ కెల్ల సునీత, పలు కాలనీల సంఘాల సభ్యులు, నాయకులు ఆసనాలు వేశారు. వీరికి యోగా శిక్షకులు ఆసనాలు వేయడం, సూర్య నమస్కారాలు చేయడం నేర్పించారు.

ముడసర్లోవ పార్కుకు రక్షణ కరవు



రక్షణ గోడ కూలడంతో ఓపెన్‌గా కనిపిస్తున్న ముడసర్లోవ పార్కు

ఆరిలోవ: స్థానిక ముడసర్లోవ పార్కు ఓపెన్ పార్కుగా మారిపోయింది. ప్రశాంత వాతావరణంలో ఉన్న ఈ ఉద్యానవనం కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరింది. సుమారు ఏడేళ్ల కిందట ఈ పార్కు చుట్టూ పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. ఆయా చోట్ల పార్కు సిబ్బంది లోపలకు ప్రవేశించకుండా కర్రలతో కంచె ఏర్పాటు చేశారు. ఇటీవల పార్కుకు చెందిన క్యాంటీన్ పక్కన సుమారు 20 మీటర్ల వరకు రక్షణ గోడ కూలిపోయింది. ప్రస్తుతం దీని లోపలి భాగం బయట రోడ్డు మీద నుంచి కనిపిస్తుండటంతో ఓపెన్ పార్కుగా తయారైంది. పార్కు లోపలకు ప్రవేశించడానికి ముఖద్వారంతో పనిలేకుండా ఏ మూల నుంచైనా వెళ్లేందుకు వీలుగా మారింది.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

జీవీఎంసీ ఉద్యోగులకు ఊరట

అల్లిపురం: జీవీఎంసీ సర్వే నంబర్ 7 రేసపువానిపాలెంలో అక్రమ నిర్మాణాలకు అనుమతించినట్లు చెప్పబడుతున్న టీపీబీవో కె. లావణ్య, ఇంజినీరు డి.శ్రీనివాసులు అక్రమ నిర్మాణాలను నివారించడంలో విఫలమైనందుకు, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో తగిన చర్యలు తీసుకోకపోవడం, ఆక్రమణలను అనుమతించడం వల్ల జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం కలిగిందని నిర్ధారించబడిన కారణంగా మూడేళ్ల పాటు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కె.లావణ్య, డి.శ్రీనివాసులు అప్పీలుకు వెళ్లడంతో నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేసి వాటిని ధ్రువీకరించినందు వల్ల స్థానిక సంస్థకు ఆర్థిక నష్టం కలగనందున మొదట విడుదల చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ (సీసీ–ఎ) నిబంధనలు 1991లోని నిబంధన 38 ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. పరవాడ ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–2పై వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో అవగాహన సదస్సులో సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



16వ వార్డు కేఆర్ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న అంగన్‌వాడీ టీచర్



28వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో నీలిమ (ఫైల్)

అమ్మలాంటి అంగన్‌వాడీ

- అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లలో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన
- గర్భిణులు, బాలింతలకు చక్కని సేవలు
- ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం పంపిణీ



కూరగాయల పేర్లు నేర్చుకుంటున్న పిల్లలు

మద్దిలపాలెం: చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు చక్కని రీతిలో వారికి సేవలందిస్తున్నాయి. పిల్లలకు అమ్మలాంటి సంరక్షణను అందిస్తూ విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పిస్తున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు వంటి అన్ని అంశాలను శ్రద్ధతో నిర్వహిస్తున్నాయి. టేక్ హోమ్ పద్ధతిలో బాలింతలకు ఇంటికే రేషన్ అందిస్తూ వారు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో మహర్దశ

అంగన్‌వాడీ కేంద్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోడరన్ ప్రీ స్కూళ్లగా తీర్చిదిద్దింది. అప్పటి నుంచి పిల్లలకు నూతన రీతిలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను టీచర్, ఆయా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఆటపాటలతో విద్య నేరుకునేందుకు రకరకాల ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. పిల్లల ప్రగతిని తెలియజేసేందుకు పేరెంట్–టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ అవసరమైన పోషకాహారాన్ని అందజేస్తున్నారు. చిన్నారులు రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు వీలుగా డ్రై రేషన్ పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా తీర్చిదిద్దడంతో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సేవలందిస్తున్నాయి.

ఇంటికే సరకులు..

టేక్ హోం రేషన్ పద్ధతిలో గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు ఒకసారి 1 నుంచి 5వ తేదీలోపు రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కేజీ బెల్లం, పావు కేజీ బెల్లం చెక్కీలు, పావు కేజీ ఖర్జూరం, 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు. రెండో విడతగా నెలలో 16వ తేదీ నుంచి మొదటి విడతలో ఇస్తున్నట్టే పంపిణీ చేస్తున్నారు. పిల్లల తల్లులకు నెలలో రెండు సార్లు కలిపి 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్నారు.

ప్రారంభమైన అడ్మిషన్లు

అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో **భాగంగా అంగన్**‌వాడీ కేంద్రాల్లో సామూ**హిక అక్షరాభ్యాస** కార్యక్రమాలు ఘనంగా **నిర్వ హిస్తున్నారు.** ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ **నూతన సీడీపీవో** కె.నీలిమ స్వయంగా **పాల్గొని చిన్నారుల** చేత శాస్త్రోక్తంగా అక్ష**రాలు దిద్దించి** అక్షరాభ్యాసాలు చేయి**స్తున్నారు. అంగన్**‌వాడీ ప్రీ స్కూళ్లలో **అడ్మిషన్లు జరుగు**తున్నా యని, తల్లిదం**డ్రులు తమ పిల్లల**ను చేర్పించి ఇక్కడ అంది**స్తున్న ఆటపాటల**తో కూడిన విద్యా బోధ**నను, ప్రభుత్వ** ప్రయో జనాలను సద్విని**యోగం చేసుకో**వాలని సీడీపీవో నీలిమ **కోరుతున్నారు.**

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో ఒకటి, కొత్త వెంకోజిపాలెం–2లో ఒకటి చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 16వ వార్డులో 8 ఉండగా.. వీటిలో మద్దిలపాలెం–1, 2, 3, 4గా నాలుగు, కేఆర్ఎం కాలనీ–1, 2, 4గా మూడు, అంబేడ్కర్ కాలనీ ఒకటి చొప్పున అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహిస్తున్నారు. 23వ వార్డులో చైతన్యనగర్–1, 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో ప్రీ స్కూల్‌లో 20 మంది చొప్పున చిన్నారులు చదువుకుంటున్నారు. ఈ సెంటర్ల పరిధిలోని లబ్ధిదారులందరికీ ప్రతి నెలా పౌష్టికాహారం అందజేస్తున్నారు.

ప్రారంభం కాని పార్కులో పచ్చదనం మాయం



జోడుగుళ్లపాలెం పిల్లల పార్కులో ఎండిపోయిన లేన్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో ని పిల్లల పార్కులో పచ్చదనం మాయమైంది. ఇందులో ఏర్పాటు చేసిన లేన్లు ఎండిపోయాయి. ఈ పార్కును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించారు. 2024 ఏప్రిల్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి న నాటికి పార్కు లోపల పిల్లలు సేదతీరడానికి షెడ్, రక్షణ గోడలు, పాత్‌వేలు సైతం నిర్మించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పిల్లల ఆట పరికరాలు, లోపల పలుచోట్ల పచ్చదనం ఏర్పాటు చేసి ఆర్చ్ నిర్మించడానికి ఏడాది పట్టింది. వైఎస్సార్‌సీపీ కాలంలో మంజూరైన పార్కు కావడంతో ఇంతవరకు దీన్ని ప్రారంభించకుండా వదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రారంభం కాకపోయినా పిల్లలు ఆటలాడుకోవడానికి వెళ్తున్నారు. అంత వరకు బాగానే ఉన్నా.. ఈ పార్కులో పచ్చదనం కోసం రెండుచోట్ల లేన్లు అమర్చారు. అది ఇటీవల ఎండిపోయింది. బయటకు మట్టి, రాళ్లు పిక్కలు కనిపిస్తున్నాయి. అక్కడ ఆటలాడుతున్న తమ పిల్లలకు రాళ్లు గుచ్చుకుంటున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. పచ్చదనం కోసం లేన్లు ఏర్పాటు చేసిన రెండు, మూడు నెలలకే మాయమవడంతో నాణ్యత లోపం కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పిల్లల పార్కును తక్షణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ ఎంపికలు



ఎన్‌సీసీ ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో 11 ఏజేడీ ట్రూప్ కమాండర్, పాఠశాల ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎ న్.వి విశ్వనాథం నేతృత్వంలో బుధవారం ఎన్‌సీసీ 2025–2027కు సంబంధించిన ఎంపికలు జరిగాయి. పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు క్యాడెట్లుగా ఎంపికయ్యారు. సుబేదార్ మజర్ జయప్రకాష్, హవల్దార్ శ్యామలరావు, శుక్రరాజ్‌లు విద్యార్థులకు శారీరక పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, 2 ఆంధ్ర బెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, సునీత, గ్లోరీ, పుష్పలత, శ్యామల, రామలక్ష్మి, అప్పారావు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లోని దయాల్ బాగ్ ఎడ్యుకేషనల్ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ ట్రైనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, కటింగ్ అండ్ సుయింగ్, మోటార్ కార్, మోటార్ బైక్ మెకానిజం, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మొబైల్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోర్సులను బట్టి 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మహిళలు, పురుషులకు కోర్సులు కేటాయించామని, ఆసక్తి గల వారు జూలై 1 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99633 40611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యోగాంధ్రలో ఏయూ ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలి



యోగాంధ్ర కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఉద్యోగులు

విశాఖ సిటీ: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన యోగాంధ్ర కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా కేటాయించిన ప్రాంతంలో యోగా సాధనకు హాజరు కావాలని చెప్పారు. ఉద్యోగులంతా యోగాకు తగిన సమయాన్ని కేటాయించాలని సూచించారు. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని, విద్యార్థులకు మెరుగైన సేవలను అందించడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు యోగాపై ప్రచారం నిర్వహించడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, యోగా విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ బాబు, ఉద్యోగులు తిరుపతిరావు, పీతల అమరేంద్ర, ఒమ్మి నూక రాజు, బండారి దేవుడు, టి.సాయి బలరాం, యాసీన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో యోగా డే ప్రత్యేక కార్యక్రమాలు



యోగా డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం –2025లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ నేతృత్వంలో బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల స్కూల్ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక విద్యార్థులు, రైల్వే ఉద్యోగుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్‌లోని రైల్వే ఉద్యోగుల కోసం ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రైల్వే సిబ్బంది, ఉద్యోగులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఉద్యోగుల కుటుంబాలు కలిసి పలు రైల్వే స్టేషన్లలో యోగా సాధన చేశారు. పిల్లలు, పెద్దలు, ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా మనసు, శరీరాన్ని అదుపులో ఉంచుకోవచ్చని డీఆర్ఎం లలిత్ బోరా ఈ సందర్భంగా తన సందేశంలో తెలిపారు.

ఏఐసీయూ వైజాగ్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఆర్చి బిషప్ ఉడుముల బాల

డాబాగార్డెన్స్: మహారాణిపేట ఆర్‌సీఎం పాస్టల్ సెంటర్ హాల్‌లో బుధవారం ఆలిండియా క్యాథలిక్ యూనియన్(ఏఐసీయూ) విశాఖపట్నం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల పాల్గొని పలు సూచనలు చేశారు. సంఘం విశాఖ గౌరవ అధ్యక్షుడు గోన స్వామినాథం మాట్లాడుతూ ఏఐసీయూ విధి విధానాలు, కార్యకలాపాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలు వివరించారు. సంఘం విశాఖ రీజియన్ అధ్యక్షుడు, జాతీయ సహాయ కార్యదర్శి బూర వేలంగిణి రవీంద్ర శేషుబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, సమాజ సేవ, విద్యాభివృద్ధి, పేదలు, అభాగ్యులు, బడుగు వర్గాలను పైకి తీసుకురావడంలోనూ ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, వందేళ్ల పైబడిన సంఘం పురోగతిని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏఐసీయూ సభ్యుడు చిట్టిబాబును ఆర్చి బిషప్ ఉడుముల బాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ ఎం.ప్రతాప్, విశాఖ అర్బన్ డీన్ ఫాదర్ ఎస్.ప్రతాప్, ఏఐసీయూ కార్యదర్శి బేతా జోసెఫ్, కోశాధికారి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన అభాగ్యులు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది రైల్వే పోలీసుల సహకారంతో బుధవారం ఎనిమిది మంది నిరాశ్రయులను జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్ హోంకు తరలించారు. దయగాన్, ఒడిశాకు చెందిన ప్రీతీ రాజేశ్వరి, బీహార్‌కు చెందిన సుఖన్, బొబ్బిలికి చెందిన తాబ్బిరి సత్యనారాయణ, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన లాకొజీ నారాయణ స్వామి, గుర్లకు చెందిన పెనుబర్తి నాయుడు, కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన రాజు, దువ్వాడకు చెందిన నిర్మల్ సింగ్, బీహార్, బంకాకు చెందిన సంతోష్ కుమార్ శర్మ తదితరులను షెల్టర్‌కు తరలించారు. వీరిలో ఒక్కరు మినహా మిగతా వాళ్ల మానసిక స్థితి సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పెట్టింది తింటూ బతుకుతున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరందరినీ ఫుట్ పాత్‌లు ఖాళీ చేయించి షెల్టర్లకు తరలించినట్లు వాసు తెలిపారు.

సింహగిరుల్లో సాగుకు అనాసక్తి!

ఎన్నో పుట్టుధారలకు నిలయమైన సింహగిరి కొండల్లో పండే అనాస(పైనాపిల్) రుచే వేరు. అందుకే ఇక్కడి అనాసకు ఎంతో డిమాండ్. ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు సింహగిరి అనాస పండ్లు కనువిందుచేసేవి. సింహాచలం పరిసర ప్రాంతాల్లో గుట్టలుగా పోసి విక్రయించేవారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెద్ద ఎత్తున వాటిని కొనుగోలు చేసేవారు. అప్పట్లో విరివిగా లభించే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేసేవారు. అలాంటిది ఇప్పుడు ఇతర ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన అనాస పండ్లను సింహాచలంలో విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.



- సింహాచలం అనాస రుచులు ఇక గతం
- ఒకప్పుడు గుట్టలుగా పోసి విక్రయాలు
- నేడు కనీస స్థాయిలోనూ కనపడని వైనం
- వీటి సాగువల్లే పైనాపిల్ కాలనీ పేరు!



ఒకప్పుడు అనాస పండించిన సింహగిరి కొండలు



పైనాపిల్ పేరు మీద ఏర్పడిన కాలనీ



అనాస పండిన ప్రాంతంలో ఇప్పుడున్న జీడి చెట్లు

సింహాచలం: ఎంతో ప్రసిద్ధి చెందిన సింహగిరి అనాస(పైనాపిల్) రాన్రాను కనుమరుగవుతోంది. ఒకప్పుడు సింహగిరి కొండల్లో అనాస పండేదట.. ఎంతో తియ్యని రుచితో ఉండేదట.. అని రానున్న రోజుల్లో మన పిల్లలు చెప్పుకునే పరిస్థితి నెలకొంది. ఏడేళ్ల కోసారి పంట భూమిని మార్చాల్సి రావడం, కూలి ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సింహగిరి రైతులు ఆవేదనతో చెప్తున్నారు.

మూడేళ్లకు కాపు.. ఏడేళ్లకు భూ మార్పు

అనాస పంట వేసిన మూడేళ్లకు చేతికొస్తుంది. ఈ ఏడాది నారు నాటితే వచ్చే ఏడాది కాకుండా ఆ వచ్చే ఏడాది పంట చేతికొస్తుంది. తొలిసారి ఒక కాయ మాత్రమే కాస్తుంది. ఆ తర్వాత మొక్క నుంచి పక్కన పిలకలు వచ్చి రెండు కాయలు కాస్తుంది. అలా వచ్చే పిలకల ఆధారంగా కాయల సంఖ్య పెరుగుతుంది. ఏడేళ్లు మాత్రమే పంట వస్తుంది. ఆ తర్వాత ఆ భూమిలో సారం తగ్గి పంటకు అనుకూలించదు. దీంతో ఆ స్థలాన్ని అలానే వదిలేసి, మరో స్థలాన్ని వెతుక్కోవాలి.

పైనాపిల్ కాలనీ ఏర్పడిందిలా..

సింహగిరి కొండల్లో రైతులు దేవస్థానం వద్ద శిస్తు కట్టి తీసుకున్న స్థలంలో అనాసను పండించేవారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఈ కొండల్లో సుమారు 250 ఎకరాలను(కొండ, కొండవాలు కలిపి) సన్నకారు రైతులకు అందించారు. ఒక్కొక్కరికి ఎకరం పొలంతో పాటు, ఒక ఇల్లు చొప్పున కేటాయించారు. అదే ఇప్పుడు సింహాచలం నుంచి హనుమంతవాక దారిలో ఉన్న పైనాపిల్ కాలనీగా పేరుగాంచింది. పేద రైతులంతా ఇక్కడ ఉంటూనే సమీపంలో ఉన్న కొండల్లోకి వెళ్లి అనాసను పోడు వ్యవసాయంగా సాగుచేసేవారు.

వర్షాధారం.. ఎంతో కష్టం

రైతులు అనాస పండించేందుకు కొండల్లోకి ఉదయం వెళ్తే తిరిగి సాయంత్రానికే ఇంటికి వచ్చేవారు. పూర్తిగా వర్షాధారం. అనాస సాగుకు కొండపై తుప్పల్ని, పిచ్చి మొక్కల్ని తొలగించి, స్థలాన్ని సిద్ధం చేసేందుకు చాలా కష్టపడాలి. నారు వేయడం, గొప్పుతవ్వడం తదితర పనులు చేసేవారు. అడవిపందుల బారిన పడకుండా పంటను కాపాడుకునేందుకు నిరంతర కాపలా తప్పనిసరి. ఇంతచేసినా ఒక్కో ఏడాది దిగుమతి సరిగా రాకపోవడం, అడవి పందులు పంటలను నాశనం చేయడంతో కష్టం వృథాగా మారిన సంఘటనలెన్నో..!

అనాస పోయె.. జీడి వచ్చె!

అప్పట్లో అనాస పంట వేసిన కొండ అంతటా ప్రస్తుతం జీడి, పనస చెట్లే కనిపిస్తున్నాయి. ఏడేళ్ల తర్వాత అనాస పంటకు ఆ భూమి సహకరించకపోవడంతో రైతులంతా జీడి సాగుకు మళ్లారు. మరో చోట వేయాలంటే దేవస్థానం కొండ కావడం, అప్పటికే ఇందిరమ్మ పేరిట ఇచ్చిన భూములు కూడా దేవస్థానానికి చెందిన గ్రీన్‌బెల్ట్‌గా ప్రకటించడంతో చాలామంది రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరోవైపు అనాస సాగులో నష్టాలు, కూలి ఖర్చు భారమవడంతో రైతులు ఈ పంటల సాగును విరమించుకున్నారు.

ఏడేళ్లు సాగు చేశా..



నేను ఏడేళ్లపాటు అనాస సాగుచేశా. అప్పట్లో ఇందిరమ్మ ఇచ్చిన మొత్తం 250 ఎకరాల్లోనూ రైతులు అనాస సాగుచేసేవారు. ప్రస్తుతం జీడి చెట్లు కనిపిస్తున్న కొండంతా అప్పట్లో అనాస తోటలే ఉండేవి. ఎస్.కోటకు ఇక్కడి నుంచే పెద్ద ఎత్తున అనాసపళ్లు పంపించేవాళ్లం. ఏడేళ్ల తర్వాత భూసారం తగ్గి, అనాస పంటకు ఆ భూమి పనిచేయదు.

– బంధం లక్ష్మణరావు, రైతు, పాత అడవివరం

అప్పట్లో గుట్టలుగా విక్రయాలు



ఏటా జీడి, పనస వ్యాపారం చేస్తుంటాం. అప్పట్లో సింహాచలానికి చెందిన అనాస పండ్లు గుట్టలుగా పోసి విక్రయాలు జరిపిన పరిస్థితి ఉండేది. చాలామంది ఇక్కడి అనాస కోసం ప్రత్యేకంగా వచ్చి, కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చాలామంది సింహాచలం కొండపై పండే అనాస లేదేం.. అంటూ అడుగుతున్నారు.

– వరలక్ష్మి, వ్యాపారి, సింహాచలం